


# పరోపకారం

చాలాకాలం క్రితం వరుసగా గాలివానలు వచ్చి పంటలు నాశనమయ్యాయి. పండ్లతోటల్లో చెట్లు వ్రేళ్ళతో సహా పెళ్ళగించుకుని పడి పోయాయి. రైతులకు అపార నష్టం వాటిల్లింది. పొలాల్లో, తోటల్లో కూలిపనులు చేసి బ్రతికే వారు పనులు దొరక్క కటకటలాడిపోయారు.

ఇక నాగులవరంలో వుంటే తిండి గూడా దొరకదని గ్రహించి చండీదాసు, దేవయ్య బయల్దేరి సింహపురం చేరుకున్నారు. నాలుగు రోజులు పట్టణం అంతా తిరిగారు పనికోసం. కొత్త ముఖాలు కావడంవల్ల పనిలో పెట్టుకోవ డానికి జంకారు కొందరు. పనులేమీ లేవని వది లించుకున్నారు మరి కొందరు. తెచ్చుకున్న తిండి గింజలు సత్రంలో వండుకుని తింటున్నారు. అవి కాస్త నిండుకున్నాయి. ఏం చెయ్యాలో తోచక తిరు గుతూ బజారు చేరుకున్నారు. అక్కడ జన సమర్ధంగా వుంది.

ఒక కూరగాయల కొట్టు దగ్గర నిల్చున్నారు. కొంచెం దూరంలో ఒక ముసలాయన బాటకి పక్కగా పడిపోయి వున్నాడు. అతన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇంకా బ్రతికి వున్నట్లు డొక్కలు మాత్రం కదులుతున్నాయి.

కూరగాయల కొట్టులో వున్న కొండయ్య చండీదాసుని, దేవయ్యని పిలిచాడు. ఏదైనా కూలి పని చెప్తాడేమో అని ఆశతో వెళ్ళారు.

“మీరు చాలాసేపటి నుంచి ఇక్కడే నిల్చు న్నారు ఏం చేస్తున్నారు?” అని ప్రశ్నించాడు.

“ఏదైనా పని దొరుకుతుందని ఇక్కడికి

వచ్చాం. నాలుగు రోజుల్నుంచి తిరుగుతున్నాం. ఎవరూ పని ఇవ్వలేదు."

"అయితే ఖాళీగానే వున్నారుగా! ఒక పని చేస్తారా?" అన్నాడు కూరగాయల కొట్టు కొండయ్య.

"చెప్పండి ఏ పనైనా చేస్తాం" అన్నారు.

"అటు చూడండి. పాపం ఎవరో ముసలాయన చాలా సేపటి నుంచి పడి వున్నాడు. ఎవరూ పట్టించుకోవడం లేదు. మీరు అతన్ని వైద్యుడి దగ్గరికి తీసుకెళ్ళండి. పుణ్యం వస్తుంది." అన్నాడు.

చండీదాసు, దేవయ్య నిరాశ పడ్డారు. ఏదైనా పని చెప్తాడేమోననుకుంటే ఈయన చెప్పేది ఇదా అనుకున్నారు.

"బాగుంది మీరు చెప్పింది. ఆయన్ని వైద్యుడి దగ్గరికి తీసుకెళ్తే మాకేమి లాభం వస్తుంది? పైగా ఆ వైద్యుడు మమ్మల్ని డబ్బు అడిగితే? ఎక్కడ్నుంచి తెచ్చివ్వాలి మేము. మా దగ్గర చిల్లిగవ్వ లేదు." అన్నాడు దేవయ్య.

అతను నవ్వి "అలా అనకండి బాబూ! మనిషి అన్నాక కాస్త మానవత్వం వుండాలి. ప్రతి పనికీ లాభం ఆశించగూడదు. ఎవరో పాపం జబ్బుతో పడిపోయి వున్నాడు. వైద్యుడి దగ్గరికి తీసుకెళ్ళండి మీ ధర్మం నెరవేర్చిన వాళ్ళవుతారు. ఇక వైద్యుడు వైద్యం చేస్తాడో చెయ్యడో అది వేరే విషయం. వైద్యో నారాయణ హరి అన్నారు. ప్రాణం పోతూ వుంటే డబ్బు ఇవ్వలేదని ఏ వైద్యుడూ చూస్తూ వూరుకోడు." అన్నాడు.

చండీదాసుకి అతను చెప్పిందంతా విని చిరాకు కలిగింది. పొట్టగడవక చస్తుంటే ఈయన పరోపకారం చెయ్యమని హితబోధ చేస్తాడేమిటి? అంత జాలి గలవాడు కొట్టు మూసేసి ఆ ముసలాయన్ని వైద్యుడి దగ్గరికి తీసుకెళ్ళ గూడదూ? ఆ పుణ్యం ఏదో తనకే వస్తుందిగా అనుకున్నాడు.

"చూడండి బాబూ! ఇటువంటి అసహాయులకు సహాయం చెయ్యడం వల్ల ఒక్కోసారి చాల లాభం కలుగుతుంది గూడా. ఉదాహరణగా మీకు ఒక కథ చెప్తాను. సింహపురం మంత్రి విశ్వనాధయ్య మీకు తెలుసుకదూ?

"ఆయన తెలియని వాళ్ళు ఈ రాజ్యంలో ఎవరు వుంటారు?"

"విశ్వనాధయ్య మంత్రి ఎలా అయ్యాడో మీకు తెలుసా? ఒకసారి సింహపురి రాజుగారు మారు వేషంలో పట్టణంలో తిరుగుతున్నాడు. గస్తీలో తిరిగే రక్షక భటుల అజాగ్రత్త వల్ల దొంగలు ఒక ఇంట్లోకి ప్రవేశించి దోపిడీ చేస్తున్నారు. అది రాజుగారు గమనించి వారిని ఎదుర్కొని తరిమి కొట్టాడు. దొంగలు పారిపోతుంటే వాళ్ళని పట్టుకుని బంధించాలని రాజుగారు తరుముతూ అడవిలోకి ప్రవేశించాడు. దొంగలు దొరకలేదు. రాజుగారి గుర్రం హఠాత్తుగా ఒక లోయలోకి జారి పోయి చచ్చిపోయింది. రాజుగారికి తీవ్రంగా గాయాలయ్యాయి. ప్రాణాపాయస్థితిలో వున్నాడు. తెల్లవారిన తర్వాత విశ్వనాధయ్య కట్టెలు కొట్టు కోవడానికి అడవికి వచ్చి రాజును చూశాడు. అతి కష్టం మీద ఆయన్ని ఊళ్ళోకి మోసుకెళ్ళి వైద్యుడి దగ్గరికి తీసుకెళ్ళాడు. సమయానికి వైద్య సహాయం అంది రాజుగారు బ్రతికాడు. ఆయన రాజు అని ఎవరికీ తెలియదు. ఎవరో బాటసారి

అని విశ్వనాథయ్య అనుకున్నాడు. తనకి ఏమి లాభం వస్తుందని అనుకోకుండా వైద్యం చేయించాడు. రాజు కృతజ్ఞతలు చెప్పి వెళ్ళి పోయాడు. విశ్వనాథయ్య పండితుడనీ, అపారమైన తెలివితేటలు, జాలి, దయగలవాడనీ రాజు తెలుసుకున్నాడు. కొన్నాళ్ళకి సింహపురి మంత్రి చనిపోయాడు. తర్వాత విశ్వనాథయ్య కోసం రాజు ముత్యాల పల్లకీ పంపించాడు. రాజధానికి ఆహ్వానించి మంత్రి పదవి ఇచ్చాడు. అప్పుడు తెలుసుకున్నాడు విశ్వనాథయ్య ఆనాడు తను రక్షించింది రాజు గారినే అని."

కూరగాయల కొట్టు ముసలాయన చెప్పిన కథ విని దేవయ్య అన్నాడు చండీదాసుతో, "పోనీలేరా! ఈ ముసలాయన్ని మోసుకునిపోయి వైద్యుడి దగ్గరికి చేరుద్దాం. పుణ్యమో, పాపమో ఇంతగా చెప్తున్నాడుగా"

చండీదాసు సరే అన్నాడు అయిష్టంగా. వాళ్ళిద్దరూ కలసి బాట పక్కన పడిపోయి వున్న ముసలాయన్ని భుజాల మీద మోసుకుని వైద్యుడి దగ్గరికి బయల్దేరి వెళ్ళారు.

వాళ్ళు వెళ్ళిపోయిన తర్వాత కొండయ్య మనుమడు అడిగాడు.

"తాతా! మన మంత్రి విశ్వనాథయ్య రాజు గారిని రక్షించి మంత్రి అయ్యాడా? నాకీ సంగతే తెలియదే."

తాత నవ్వి అన్నాడు. "అదంతా వుట్టిదే. నేనే కల్పించి చెప్పాను. మనిషికి ఏదైనా ఆశ చూపిస్తే గాని ఏ పనీ చెయ్యడు. వాళ్ళు ఎంత చెప్పినా వినడం లేదని అలా చెప్పాను."

తాత మనుమడు నవ్వుకున్నారు. తర్వాత వాళ్ళ గురించి దాదాపు మర్చిపోయారు.

నెల రోజుల తర్వాత చండీదాసు, దేవయ్య కూరగాయలు కొనడానికి కొట్టుకి వచ్చారు. కొండయ్య వాళ్ళని గుర్తు పట్టలేదు.

"తాతా! నువ్వు చెప్పినట్లు ఆ ముసలాయన్ని వైద్యుడి దగ్గరికి మోసుకుపోవడం వల్ల మాకు మేలే జరిగింది." అన్నాడు చండీదాసు.

కొండయ్యకి ఆనాడు జరిగిందంతా గుర్తొచ్చింది.

"ఏం జరిగింది?" అని ప్రశ్నించాడు కొండయ్య.

"ఆ ముసలాయన్ని వైద్యుడి దగ్గరికి మోసు కెళ్ళాం. వైద్యుడు వెంటనే వైద్యం చేశాడు. కొంతసేపటికి ఆయనకి తెలివి వచ్చింది. వైద్యుడి ద్వారా జరిగినదంతా తెలుసుకుని మమ్మల్ని పిలిచి కృతజ్ఞతలు చెప్పాడు. తోటి మనిషి చస్తున్నా పట్టించుకోకుండా ఎవరి దారిన వాళ్ళు పోతున్న ఈ రోజుల్లో ఏమీ ఆశించకుండా నన్ను వైద్యుడి దగ్గరికి చేర్చారు. నా ప్రాణాలు కాపాడారు. మీరు ఎవరు? ఏం చేస్తుంటారు అని అడిగాడు. మేము పని కోసం తిరుగుతున్నామని చెప్పాం. ఆయన పేరు గోపాలయ్య. సింహపురి సైనికాధికారికి తాత. మతి స్థిమితం లేక తిరుగుతూ వుంటాడట. మమ్మల్ని వాళ్ళింటికి తీసుకెళ్ళాడు. తన మనుమడికి జరిగిందంతా చెప్పాడు. తన తాతకి సహాయం చేసినందుకు సైనికాధికారి సంతో షించాడు. రాజుగారి కొలువులో మా ఇద్దరికీ ఉద్యోగాలు ఇప్పించాడు." అని చెప్పారు చండీ దాసు, దేవయ్య.

తాత అదంతా ఆశ్చర్యంగా విన్నాడు.